# ఇస్తెమాకు ఏర్పాట్లు చేయాలి

- వచ్చే నెల 4, 5 తేదీల్లో శంకర్‌పల్లిలో నిర్వహణ
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి



కార్యక్రమ ఏర్పాట్లపై ముస్లిం మతపెద్దలు, అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో పక్కన ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, డిసెంబర్ 17 : ఇస్తెమా కార్యక్రమానికి ఏర్పాట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 4, 5 తేదీల్లో శంకర్‌పల్లిలో జరుగనున్న కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం ఆయన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ముస్లిం మతపెద్దలు, అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. అధికారులు, మత పెద్దలు సమన్వయంతో పనిచేస్తూ ప్రోగ్రామ్‌ను సక్సెస్ చేయాలన్నారు. భక్తులు అధికంగా హాజరు కానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. తాగునీటితోపాటు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందుల్లేకుండా సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు అధిక మొత్తంలో పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, డీఎండబ్ల్యూవో నవీన్‌రెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాజేశ్వర్, మిషన్ భగీరథ అధికారులు, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ప్రతి హాస్టల్‌లోనూ మౌలిక వసతులు కల్పించాలి

- వి కారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- హాస్టళ్ల నిర్వహణపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారులు, హాస్టళ్ల వార్డెన్లతో మీటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 17: జిల్లాలోని ప్రతి హాస్టల్‌లోనూ మౌలిక వసతులు కల్పించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారులు, హాస్టళ్ల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో ఉండే మేజర్, మైనర్ మరమ్మతులపై దృష్టి సారించి, పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. ప్రతి వసతిగృహంలోనూ పిల్లల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, లైట్లు, ఫ్యాన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పూర్తైన పనులను ఫొటోలు తీసి పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలాల వారీగా వసతిగృహాల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత వార్డెన్లు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని.. వివరాలను సమగ్రంగా తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో ఎంట్రీ చేయాలన్నారు. పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్ద న్నారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను ఎంట్రీ చేసేందుకు ఎంత సమయం పడుతున్నది.. రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు ?, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులున్నాయా..? ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారని అడిగి తెలుసుకు న్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ఉంటున్న వారు కొత్త ఇం టిని నిర్మించుకునేందుకు ముందుకొస్తే, వారి వివరాలనూ సర్వే యాప్ లో పొందుపర్చాలన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

సమీక్షలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఈ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈ పనసారెడ్డిలతో కలిసి కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోన్ల వారీగా వాటర్ లాగింగ్ పాయింట్స్, రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులపై సమీక్షించారు. గ్రేటర్‌లో ప్రజల అవసరాల దృష్ట్యా చేపట్టిన పనులను ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. 141 వా టర్ లాగింగ్ పాయింట్‌లను తగ్గించేందుకు శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే వర్షాకాలంలో సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ చేపట్టిన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో 12 వాటర్ హోల్డింగ్ నిర్మాణాలను చేపట్టగా.. అందులో 4 పనులు పూర్తి కాగా, మిగతా పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నందున అసంపూర్తి పనులు జనవరి నెల లోగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు ఫీజిబిల్టీ గుర్తించాలన్నారు. 125 జంక్షన్ల అభివృద్ధికి గుర్తించిన నేపథ్యంలో భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ సమస్య పరిష్కారానికి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, ప్రకటనలు, యూబీడీ విభాగాల అధికారులతో కమిటీ వేసినట్లు, ఈ కమిటీ జంక్షన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

గ్రేటర్‌లో రూ.124.68 కోట్ల అంచనా వ్యయంతో 195 సుందరీకరణ పనులు చేపట్టగా, అందులో 28 పనులు పూర్తి కాగా, ఇంకా 167 పనులు వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి దశలో ఉన్నాయని, సంబంధిత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అసంపూర్తి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ ఉన్న చోట పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా టెక్నికల్ ఫీజిబిలిటీ ఉన్న ప్రదేశాల్లో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్లు పృథ్వి, బాలాజీ, జోనల్ ఎస్ఈలు రత్నాకర్, మహేశ్ రెడ్డి, నిత్యానంద, శంకర్ నాయక్, చిన్నారెడ్డి, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

### పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేయాలి



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పరిగి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, శంకర్ మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఉద్దండాపూర్ ప్రాజెక్టు వరకు నీటిని అందించేందుకు కాల్వల పనులు పూర్తయ్యాయని, పరిగి, షాద్‌నగర్ ప్రాంతాల్లోని సుమారు 80 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు.

-పరిగి, డిసెంబర్ 17



కోటబాసుపల్లి బడిలోని మెనూ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

# నాణ్యమైన భోజనం అందించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్, డిసెంబర్ 17 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని కోటబాసుపల్లి, కొత్లాపూర్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి.. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతోపాటు మెనూ రిజిస్టర్, స్టాక్ పాయింట్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌కు సూచించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యతోపాటు మంచి భోజనం అందించాలన్నారు.

# రైతుల పంట రుణాలను మాఫీ చేయాలి

భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి

మొయినాబాద్, డిసెంబర్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. ఎలాంటి నిబంధనలు, కొర్రీల్లేకుండా రైతులందరి పంట రుణాలను మాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రైతుల సమస్యలు పరిష్కరించాలని, పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌కు భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించి మాట్లాడారు. రైతుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాంచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంటయ్య, మల్లారెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జగదీశ్, మల్లయ్య, నర్సింహులు, చంద్రమౌళి, స్వామి పాల్గొన్నారు.

### కుట్టుమిషన్లకు మహిళ లు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, డిసెంబర్ 17 : ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మహిళలకు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉచితంగా కుట్టుమిషన్లను అందిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా మైనార్టీ శాఖ అధికారి హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 16 నుంచి డిసెంబర్ 31 వరకు మైనారిటీ మహిళలు, సిక్కులు, జైనులు తదితరులు ఆన్‌లైన్ TGOBMMS web: tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకుని.. ఆ అప్లికేషన్ హార్డ్ కాపీని జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం వికారాబాద్‌లో ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 79933 57103 నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తుదారుల వయసు 17-55 ఏండ్లలోపు ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారిది రూ.రెండు లక్షలు దాటొద్దన్నారు. విద్యార్హత ఐదో తరగతి పాసై ఉండాలన్నారు.




సరిపడా బస్సుల్లేక.. ఉన్న బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

# పట్టు జారిందో..అంతే..

- ప్రమాకరంగా ఫుట్‌బోర్డులపై నిలబడి వెళ్తున్న ప్రయాణికులు
- చాలీచాలని బస్సులతో ప్యాసెంజర్స్ అవస్థలు
- ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచాలని విజ్ఞప్తి

చేవెళ్లటౌన్, డిసెంబర్ 17 : చాలీచాలని బస్సులతో ప్రయాణికులు అవస్థ లు పడుతున్నారు. చేవెళ్ల పట్టణంలోని కళాశాలలు, పాఠశాలలకు ప్రతి రోజూ మండలంలోని పలు గ్రామాలతోపాటు షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్‌ల నుంచి విద్యార్థులు చదువుకునేందుకు వస్తుం టారు. వారితోపాటు రైతులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించిన నాటి నుంచి ఏ బస్సు వచ్చినా పూర్తిగా నిండిపోయి ఫుట్‌బోర్డుపై నిలబడాల్సి వస్తున్నదని.. ప్రభుత్వం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు.





# ఎస్సీ కులాల వినతులను నివేదిక రూపంలో అందిస్తాం

సిటీబ్యూరో : ఎస్సీ కులాల ఉపవర్గీకరణ కోసం బహిరంగ విచారణ నిర్వహించామని, ఎస్సీ కులాల నుంచి వినతులను స్వీకరించామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో విలేకరులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కుల సంఘాల నుంచి 31 వినతులు అందాయని వివరించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ వినతులన్నింటినీ నివేదిక రూపంలో సర్కార్‌కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ పాల్గొన్నారు.

# వినియోగంలోకి అభివృద్ధి, సుందరీకరణ పనులు

సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి జోన్ పరిధిలో పలు జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. గోపన్‌పల్లిలో రాగా ఫౌండేషన్ నిర్మించిన చిన్న జంతు శ్మశాన వాటికను ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి మేయర్ ప్రారంభించారు. అనంతరం జేఆర్సీ జంక్షన్ బ్యూటిఫికేషన్ ఆఫ్ స్కేలింగ్, స్కల్ప్చర్, ఫౌంటెయిన్‌లను ప్రారంభించారు. బయోడైవర్సిటీ జంక్షన్ బ్యూటిఫికేషన్, శిల్పాలు, ఫౌంటైన్, లైటింగ్‌ల అప్‌స్కేలింగ్, రోడా మిస్త్రీ కాలేజ్ కమాన్ నుంచి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు వీధి ఫర్నిచర్‌ను మేయర్ ప్రారంభించారు. శేరిలింగంపల్లి సర్కిల్-20లోని గచ్చిబౌలి స్టేడియంలో శిల్పాలు, ఫౌంటైన్‌తో కూడిన రోటరీల అభివృద్ధి పనులు, ఖాజాగూడ జంక్షన్ బ్యూటిఫికేషన్ ఆఫ్ స్కేలింగ్ ఆఫ్ శిల్పాలు, లైటింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్ఈ శంకర్ నాయక్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# జలమండలిలో కారుణ్య నియామకాలు

నలుగురికి పత్రాలు అందజేసిన జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్



సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): జలమండలిలో నలుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగా మరణించిన నలుగురి ఉద్యోగుల వారసులకు వారి వారి విద్యార్హతలు బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాల్ని ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఅండ్ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఇతరులు పాల్గొన్నారు.

# లగచర్ల రైతులకు బేడీలా?

## కేసులు ఎత్తేయాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతుల వెల్లువ - ప్రభుత్వ పాశవిక చర్యలపై నిరసన



జిల్లెలగూడలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, అర్కల కామేశ్ రెడ్డి

రేవంత్ ప్రభుత్వం ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల భూసేకరణకు చర్యలు చేపట్టింది. భూములు పోతే తమకు జీవనాధారం లేకుండా పోతుందని ఆందోళ న చెందిన లగచర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నారు. భూసేకరణను అడ్డుకున్న రైతులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి బేడీలు వేసి జైలులో వేసింది. పేద రైతులు బెయిల్ కోసం ఎంత శ్రమిస్తున్నా ఫలితం లేకుండా పోతుండటంతో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి అండగా నిలిచారు. కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళ వారం బీఆర్‌ఎస్ శ్రేణులు లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతులు అందజేసి నిరసన తెలిపారు.



ఓయూ లా కళాశాలలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన బీఆర్‌ఎస్వీ నాయకులు

- బడంగ్‌పేట: లగచర్ల రైతులపై పెట్టిన కేసులను బేషరత్‌గా ఎత్తివేయాలని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న దుర్మార్గాలను, రైతులపై సాగిస్తున్న దమన కాండను మానుకొని మంచి మార్గంలో నడవడానికి బుద్ధి ప్రసాదించాలని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేతలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా లగచర్ల రైతులపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.
- ఎల్బీనగర్ : లగచర్ల రైతులకు సంఘీభావంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహచర ఎమ్మెల్యేలతో కలిసి నల్లరంగు షర్టులు ధరించి చేతులకు బేడీలు వేసుకుని అసెంబ్లీకి హాజరయ్యారు. ఇదేమీ రాజ్యం, ఇదేమీ రాజ్యం, ఖాకీ రాజ్యం, దోపిడీ రాజ్యం, లాఠీ రాజ్యం, లూటీ రాజ్యం, రైతులకు సంకెళ్లా సిగ్గుసిగ్గు అంటూ నినాదాలు చేశారు.



బాలాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు